క్లుప్తంగా

సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా రమేశ్ కుమార్



రెంజల్(బోధన్): మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా రెంజల్ మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ మర్ల రమేశ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో పనిచేసిన సాటాపూర్ సర్పంచ్ ఎజాజ్ పాష స్వచ్ఛందంగా తప్పుకుని రెంజల్ మండలకేంద్రానికి అవకాశం కల్పించారు. గురువారం మండలంలోని సర్పంచ్‌లు సమావేశమై రమేశ్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మండలంలోని పలువురు సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నేతలు సన్మానించారు. సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే షకీల్ అహ్మద్, ఎమ్మెల్సీ కవితలను కలిసి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని వివరించారు.

జీడీసీ విద్యార్థుల ఫీల్డ్ ట్రిప్

బోధన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా గురువారం స్థానిక ఎస్ఆర్ కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌ను సందర్శించారు. కోచింగ్ సెంటర్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ కంప్యూటర్ డెమో క్లాస్ నిర్వహించారు. కంప్యూటర్ కోర్సుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించి అంశాలను వివరించారు.

కృష్ణవేణిలో గ్రాడ్యుయేషన్ డే



బాల్కొండ: మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రాథమిక విద్య ఎంతో కీలకమన్నారు. విద్యార్థులు డిగ్రీ వరకు కష్టపడి చదవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పట్టాలను అందజేశారు.

నిధులిచ్చిన నేతకు సన్మానం



మాక్లూర్: జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావును గురువారం మండలంలోని గంగరమంద గ్రామస్తులు ఆయన చాంబర్‌లో ఘనంగా సన్మానించారు. తమ గ్రామంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇప్పటి వరకు రూ.5 లక్షల వ్యయంతో డ్రైనేజీ నిర్మాణాలు, గంగరమంద నుంచి మెట్టు వరకు రహదారి నిర్మించారని, మరో రూ.5 లక్షల నిధులు అడిగినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి అవసరమైన ప్రతి పని చేసిపెడుతున్నందున వీడీసీ ఆధ్వర్యంలో సన్మానం చేసినట్లు తెలిపారు. సర్పంచ్ అనుగు గంగాధర్, మాజీ జెడ్పీటీసీ గోపాల్ నగేష్, వీడీసీ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రెండో వార్డులో రంజాన్ కానుకలను స్థానిక కౌన్సిలర్ ఖాందేష్ సంగీత అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మైనార్టీలను బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఖాందేష్ సత్యం, మునీర్, మజీద్, ప్రశాంత్, అజీమ్ పాల్గొన్నారు.

ఆర్మూర్ మండలంలో..



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలంలో ముస్లింలకు రంజాన్ కానుకలను గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


జాడీజమాల్‌పూర్‌లో..



బోధన్‌రూరల్(బోధన్): జాడీజమాల్‌పూర్‌లో బోధన్ పట్టణానికి చెందిన ప్రముఖ ఎన్ఆర్ఐ ఖాజా ఆధ్వర్యంలో ముస్లిం పేదలకు రంజాన్ సరుకులు(నిత్యావసర సరుకులు) పంపిణీ చేశారు. గురువారం గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు మజర్, ఎన్ఆర్ఐ ఖాజా కుటుంబ సభ్యులు ఇబ్రహీం, అస్లాంలు వీటిని అందజేశారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ కార్యాలయాలు

- భీమ్‌గల్ మండల పరిధిలో బార్లను తలపిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



బాబాపూర్ పాఠశాలలో తాగి వదిలేసిన మద్యం సీసాలు

భీమ్‌గల్: ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలు అంటే అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంత చిన్న చూపో భీమ్‌గల్ మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల దుస్థితి చూస్తే అర్థమవుతోంది. అవి బార్లను తలపిస్తున్నాయి. భీమ్‌గల్ పట్టణ కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో తాగుబోతుల ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు తాగుబోతులకు అడ్డాగా మారుతున్నాయి. విచ్చల విడిగా ఎక్కడపడితే అక్కడే మద్యం సేవిస్తూ తమను ఏమీ చెయ్యలేరని మందు బాబులు విర్రవీగి పోతున్నారు. ముఖ్యంగా ఎంపీడీవో కార్యాలయ భవన సముదాయం పైన సాయంత్రం అయ్యిందంటే చాలు మందుబాబులు వాలిపోతారు. చీకటి కావడం, ఇక్కడ మందు కొడితే ఎవరు రాలేరు అన్న ధీమాతో నిత్యం జల్సా చేస్తున్నారు. ఎవరైన ఇది గమనించి ఇక్కడ త్రాగకూడదు అని చెబితే దాడులకు పాల్పడుతున్నారు. దీనితో పాటు వ్యవసాయ శాఖ కార్యాలయం, విద్యా శాఖ కార్యాలయ ఆవరణ, బాబాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల, జాగిర్యాలలోని ప్రభుత్వ పాఠశాల వంటి ప్రాంతాలు వీరికి అడ్డాలుగా మారిపోయాయి. చిన్న వయసులోనే యువకులు మద్యానికి, ధూమపానానికి అలవాటు పడి తల్లిదండ్రులు, తెలిసిన వారికి కనబడకుండా ఉండేందుకు ఈ అడ్డాలను ఎంచుకోవడం గమనార్హం. వైన్స్, బార్లలో కూర్చుంటే ఇంట్లో తెలుస్తుందని ఈ ప్రాంతాలను ఎంచుకుంటున్నారు.

విద్యాలయాలకు రక్షణ కరువు

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయి. చదువుల తల్లి కొలువై ఉండే విద్యాలయాలు విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనందించాల్సి ఉండగా అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి. సాయంత్రానికి పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఇళ్లకు చేరుకోగానే ఆకతాయిలు, గుర్తు తెలియని వ్యక్తులు అక్కడికి చేరుకొని అసాంఘిక కార్యక్రమాలు సాగిస్తున్న వైనం తరుచూ చోటు చేసుకుంటుంది. మందు బాబులు విందులు చేసుకుంటూ సేవించిన మద్యం ఖాళీ సీసాలను, తిన్న ఆహార పొట్లాలను అక్కడే పడేస్తున్నారు. పాఠశాలలను పర్యవేక్షించాల్సిన మండల విద్యాశాఖ అధికారి ఆ వైపు కన్నెత్తి చూడకపోవడంతోనే ఇలాంటివి దర్శనమిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని ఇలాంటి జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులు కూడా నిత్యం పెట్రోలింగ్ చేస్తే ఫలితం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మద్యం సేవించే వారిపై పోలీసులు కొరడా ఝులిపించాలని కోరుతున్నారు.



భీమ్‌గల్ విద్యాశాఖ కార్యాలయం వద్ద పరిస్థితి



ఎంపీడీవో కార్యాలయ భవనంపైన మందు సీసాలు



జాగిర్యాల ప్రభుత్వ పాఠశాలలో సిగరెట్ వ్యర్థాలు

సనాతన వీరశైవ ధర్మాన్ని ఆచరించాలి

- విశ్వశాంతి, లోక కల్యాణార్థమే అఖండ శివనామ సప్తాహ సంకల్పం
- మహారాష్ట్ర ప్రాంత బార్సీ మఠాధిపతి మణికంఠ శివాచార్య మహరాజ్
- బోధన్ ఏకచక్రేశ్వరాలయంలో 18వ అఖండ శివనామ సప్తాహం ప్రారంభం

బోధన్: ఎన్నో విశిష్టతలు కలిగి ఉన్న వీరశైవ ధర్మాన్ని ఆచరించాలని మహారాష్ట్ర ప్రాంత బార్సీ మఠాధిపతి బ్రహ్మ గురుసిద్ధ మణికంఠ శివాచార్య మహరాజ్ ప్రబోధించారు. ప్రతి ఒక్కరూ స్వధర్మ నిష్టను పాటిస్తూనే ఇతర ధర్మాలను గౌరవించాలన్నారు. మానవ సమతా ధర్మం విజయ మార్గంలో నడవాలని వీరశైవ ధర్మం ఆకాంక్షిస్తోందని జగద్గురువులు ఉపదేశాలు అందించారని పేర్కొన్నారు. వర్తమానకాలంలో జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా తాత్కాలిక, క్షణిక సుఖాల ఉచ్చులో పడి సంప్రదాయాలు, ధర్మాన్ని విస్మరిస్తున్నారని, ఈ మార్గం వ్యక్తులు, సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదన్నారు. అఖండ శివనామ సప్తాహం సంప్రదాయ పరంపర విశ్వశాంతి, లోక కల్యాణార్థం కోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.బోధన్ పట్టణంలోని పురాతన ఏకచక్రేశ్వరాలయం (శివాలయం)లో వీరశైవ సమాజ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 18వ అఖండ శివనామ సప్తాహం, పరమ రహస్య గ్రంథపారాయణ మహోత్సవాన్ని గురువారం మఠాధిపతి చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం భక్తులనుద్దేశించి ప్రవచనాలు చేశారు. భక్తులు మఠాధిపతికి పాద పూజ చేశారు.

ఏడు రోజుల పాటు సప్తాహం

సప్తాహం ఈ నెల 27 వరకు కొనసాగనుంది. ప్రతి రోజు ఉదయం 5 నుంచి 6 గంటల వరకు శివ పారాయణం, 8 నుంచి 11 గంటల వరకు వీరశైవుల ఆరాధ్య గ్రంథం పరమ రహస్య గ్రంథపారాయణం ఉంటుంది. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో పెద్ద ఎత్తున అన్నదానం, రాత్రి 9 నుంచి 11 గంటల వరకు శివకీర్తనలు, భజన కార్యక్రమాలు ఉంటాయి. వీరశైవ సమాజ్ స్థానిక గురువులు సిద్ధ లింగప్ప స్వామిజీ, మల్లికార్జునప్ప మహరాజ్, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, సునీతా దేశాయ్, కర్నె హన్మంత్‌రావు దంపతులు పాల్గొన్నారు.



బోధన్‌లో అఖండ శివనామ సప్తాహంలో పాల్గొన్న వీరశైవ సమాజ్ గురువులు, పట్టణ ప్రముఖులు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



బోర్గాం(కె)లో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న డైరెక్టర్ అశోక్



వన్నెల్(బి)లో.. చైర్మన్ సూరజ్‌రెడ్డి

మాక్లూర్: బోర్గాం(కె)లో గురువారం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ పరపతి సంఘం డైరెక్టర్ బూరోళ్ల అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేసే వరకు కొనుగోలు కేంద్రం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శేఖర్, మూట కాశినాథ్ పాల్గొన్నారు.

బోదేపల్లి, వన్నెల్(బీ) గ్రామాల్లో..

బాల్కొండ: బోదేపల్లి, వన్నెల్(బి) గ్రామాల్లో బాల్కొండ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ సూరాజ్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు, దళారులకు విక్రయించి మోస పోవద్దన్నారు. వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచ్ నోముల రవి, ఉప సర్పంచ్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్టుపై పడ్డ పిడుగు



రుద్రూర్: మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి అందరూ ఆదమరిచి నిద్రపోతున్న సమయంలో పిడుగు పడింది. మండల కేంద్రానికి చెందిన పారుపల్లి వీరేశం సేట్ ఇంటి పెరట్లో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. భారీ శబ్దానికి సమీపంలో ఉన్నవారు ఉలిక్కిపడి నిద్ర లేచారు. పిడుగు పాటుతో కొబ్బరి చెట్టు కాలుతున్న దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూసినట్లు స్థానిక ఉపాధ్యాయుడు వెల్లడించారు. సమీపంలో ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. చుట్టు పక్కల ఉన్న ఇళ్లలో విద్యుత్ సమస్య ఏర్పడింది. విద్యుత్ పరికరాలు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు.

బోధన్‌లో అకాల వర్షం

బోధన్: నియోజకవర్గం పరిధిలోని బోధన్, ఎడపల్లి, సాలూర మండలాల్లో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులు, భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ప్రస్తుతం వరి కోతలు కొనసాగుతున్నాయి. ధాన్యం రోడ్డుపై, ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టారు. ఆకస్మికంగా వర్షం కురవడంతో ధాన్యం తడిసింది. ఈదురు గాలి వల్ల కోత దశలో ఉన్న వరి పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలి



ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడారు. బీఆర్ఎస్ అమలు చేస్తున్న దళిత బంధు పథకం అర్హులైన వారికి అందించాలని, బీసీ బంధు పథకాన్ని తక్షణమే అమలు చేయాలని, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, దళితులకు మూడెకరాల భూమిని పంపిణీ చేయాలన్నారు. అలాగే నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆసరా పింఛన్లు తక్షణమే మంజూరు చేయాలన్నారు. యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తలారి నవీన్, మైనార్టీ విభాగం జిల్లా వైస్ చైర్మన్ బడు, నాయకులు రిజ్వీన్, ఇనాయత్ అలీ, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



రుద్రూర్: మండల కేంద్రంలో గురువారం బ్లాక్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మూడు ప్రాంతాల్లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ సర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్, రాయకూర్ విండో వైస్ చైర్మన్ తోట అరుణ్, రుద్రూర్ విండో డైరెక్టర్ కర్క అశోక్, సురేష్ బాబా, కోటగిరి మాజీ ఎంపీపీ గంగాధర్ రావ్ దేశాయ్, డీసీసీ డెలిగేట్ యలమంచిలి శ్రీనివాస్‌రావ్, మాసాని శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సాలూరలో ఎంపీపీ సావిత్రి ఆధ్వర్యంలో..



బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండల కేంద్రంలో ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లీం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం



కొత్తపల్లిలో పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్



ఎక్లాస్‌పూర్‌లో ప్రారంభిస్తున్న సర్పంచ్

మాక్లూర్: కొత్తపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం సర్పంచ్ వేములపల్లి సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వైద్యాధికారి సరిత ఆధ్వర్యంలో వారం రోజుల పాటు కొనసాగే కంటి వెలుగు శిబిరంలో కంటి జబ్బులు ఉన్న గ్రామంలోని ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి కంటి అద్దాలతో పాటు మందులు ఉచితంగా అందజేస్తారన్నారు. ఉపసర్పంచ్ నరేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎక్లాస్‌పూర్‌లో..

రుద్రూర్: కోటగిరి మండలం ఎక్లాస్‌పూర్‌లో గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కంటి వెలుగు శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గంగాధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్య, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయండి

అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సొంత స్థలాలున్న వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని, నిరుద్యోగులకు రూ.10 వేల భృతి, దరఖాస్తుదారులకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు జిల్లా వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండలాల్లో ర్యాలీలు, ఆందోళనలు చేశారు. అనంతరం స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బోధన్ ఆర్డీవో ఆఫీసు ఏవోకు వినతి పత్రం అందిస్తున్న ప్రజాపంథా నేతలు



ఆర్మూర్ తహసీల్దార్ వేణుకు ..



నందిపేట తహసీల్దార్ అనిల్‌కు..



కమ్మర్‌పల్లి తహసీల్దార్ సురేష్ కుమార్‌కు..



ఎడపల్లి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా..



నవీపేట తహసీల్దార్ వీర్ సింగ్‌కు..

పేద యువతి వివాహానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీనివాస్ రావ్

రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లి గ్రామానికి చెందిన పేద యువతి వివాహానికి గురువారం రూ.15వేల ఆర్థిక సాయాన్ని డీసీసీ డెలిగేట్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ కన్వీనర్ యలమంచిలి శ్రీనివాస్ రావ్ అందజేశారు. ఆయనతో పాటు జెడ్పీ మాజీ కో–ఆప్షన్ వలియోద్దీన్, డీసీసీ డెలిగేట్ గంగా ప్రసాద్, సుద్దులం మాజీ సర్పంచ్ పీర్యానాయక్, జిల్లా మైనార్టీ కార్యదర్శి వహీద్, మాజీ ఎంపీటీసీ రాములు తదితరులున్నారు.

అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ



అంబేడ్కర్ పుస్తకాలతో సంఘం సభ్యులు

నందిపేట్(ఆర్మూర్): ఇంటింటికి బాబా సాహెబ్ కార్యక్రమంలో భాగంగా డొంకేశ్వర్ మండలంలోని మారంపల్లి గ్రామంలో గురువారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బాబా సాహెబ్ అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రపంచ మేధావులలో ఒకరైన అంబేడ్కర్ ఆదర్శ ప్రాయుడని, ఆయన చరిత్ర ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు.

సంస్కృత భాషపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న నిర్వాహకులు మోహన్

నిజామాబాద్ సిటీ: ప్రతి ఒక్కరూ సంస్కృతంపై అవగాహన కలిగి ఉండాలనీ సంస్కృత భారతి తెలంగాణ నిర్వహకులు మోహన్ అన్నారు. నగరంలోని కోటగల్లీ పద్మశాలి భవనంలో 10 రోజుల పాటు సంస్కృత భాషపై కార్యక్రమాన్ని నిర్వహించగా గురువారం రాత్రి ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. సంస్కృత భాష అనేది పుట్టుకతోనే ఉందని, అంతరించి పోతున్న ఈ భాషకు మళ్లీ జీవం పోయాలన్నారు. 10 రోజుల పాటు విద్యార్థులకు పాఠాలు బోధించిన అధ్యాపకురాలు స్వరూప బెహన్‌ను పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

– అడవి పంది అడ్డు రావడంతో ఘటన

రుద్రూర్: అక్బర్‌నగర్ శివారులో రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ పై వెళ్తున్న వారికి అడవి పంది అడ్డు రావడంతో కిందపడ్డారు. ఈ ఘటనలో రాణంపల్లికి గ్రామానికి చెందిన రఘు, ఖాసీంలు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులు 100 డయల్ చేసి పోలీస్‌స్టేషన్‌కు సమాచారమివ్వడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లారు. ఇద్దరిని బోధన్ ఆసుపత్రికి తరలించినట్లు రుద్రూర్ ఎస్సై రవీందర్ తెలిపారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో గురువారం సీపీఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు 'బీజేపీకి హఠావో దేశ్‌కు బచావో'కు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఐ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు అతిథిగా హాజరై పోస్టర్లను ఆవిష్కరించారు. అన్ని చోట్ల కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.